క్లుప్తంగా

మండల పరిషత్ పరిపాలనాధికారిగా ప్రసాద్



ఎంపీడీఓకు రిపోర్టు చేస్తున్న నూతన మండల పరిపాలనాధికారి ప్రసాద్

తుని రూరల్: తుని మండల ప్రజా పరిషత్ కార్యాలయం పరిపాలనా అధికారిగా టి.ఆర్.ఎస్.ప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. కాకినాడలో జిల్లా పరిషత్ కార్యాలయంలో పనిచేస్తూ పదోన్నతిపై ఆయన తుని మండలానికి (ఏఓ)గా వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కె.సాయినవీన్‌ను కలసి జాయినింగ్ రిపోర్టును అందజేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజలకు, సహచరులకు అందుబాటులో ఉండి సకాలంలో సేవలు అందించాలని సూచించారు. డిప్యూటీ ఎంపీడీఓ జి.మరిడియ్య పాల్గొన్నారు.

మండల వ్యవసాయాధికారిగా అమృత



జోకా అమృత

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మండల వ్యవసాయాధికారిగా జోకా అమృత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె కిర్లంపూడి మండల వ్యవసాయాధికారిగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ప్రత్తిపాడు మండలానికి వచ్చారన్నారు. ప్రస్తుతం ఇక్కడ వ్యవసాయాధికారిగా విధులు నిర్వహిస్తున్న యింటి వీర గంగాధర్ పిఠాపురం మండలానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు జోకా అమృతకు మండలంలోని సచివాలయాల వ్యవసాయ సిబ్బంది స్వాగతం పలికారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం



చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

ఏలేశ్వరం: పట్టణంలో సోమవారం ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి ఆధ్వర్యంలో స్థానిక దిబ్బల పాలెంలోని దాకమూరి లోవరాజు కమ్యూనిటీ హాలులో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసంతో పాటు గ్రాడ్యుయేషన్ డే, అంగన్‌వాడీ పిలుస్తోంది పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో అంగన్‌వాడీల పరిధిలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం సత్యనారాయణ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

జూదాన్ని ప్రోత్సహిస్తే కఠిన చర్యలు



ప్రైవేట్ వసతి గృహాల నిర్వాహకులకు సూచనలు చేస్తున్న రూరల్ ఎస్సై కృష్ణమాచారి

తుని రూరల్: రానున్న ఆషాడమాసోత్సవాల్లో భాగంగా లోవ దేవస్థానం సమీప ప్రైవేట్ వసతి గృహాల్లో జూదాలను ప్రోత్సహిస్తే బాధ్యులపై కఠిన చర్యల తీసుకుంటామని రూరల్ ఎస్సై కృష్ణమాచారి హెచ్చరించారు. సోమవారం తుని రూరల్ పోలీస్ స్టేషన్‌లో నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ దేవస్థానం పరిధిలో భక్తి పేరుతో పేకాట, ఇతరేతర జూదాలు, అనైతిక చర్యలకు పాల్పడినా సహించబోమన్నారు. భక్తులకు అసౌకర్యం కలిగించొద్దన్నారు. ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని సమాచారం అందినా కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు.

మెప్మా సిబ్బందికి ట్యాబ్‌ల పంపిణీ



మెప్మా సిబ్బందికి ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ప్రత్తిపాడు: మండలం పెదశంకర్లపూడి స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం మెప్మా కమ్యూనిటీ రిసోర్సు సభ్యులకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఏలేశ్వరం నగర పంచాయతీకి చెందిన 26 మంది రిసోర్సు సిబ్బందికి ట్యాబ్‌లను అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన కోసం సేవలు అందించే మెప్మా సిబ్బందికి ఈ ట్యాబ్‌లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏలేశ్వరం నగర పంచాయతీ కమిషనర్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పాలనలో వ్యత్యాసాన్ని గమనించాలి

- కూటమిపై ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత
- తల్లికి వందనంలో లోటుపాట్లు
- పలు మండలాల్లో జగన్ అంటే నమ్మకం పుస్తకావిష్కరణాలు



జగ్గంపేట పార్టీ కార్యాలయంలో జగన్ అంటే నమ్మకం పుస్తకాన్ని నాయకులతో ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి తోట నరసింహం

జగ్గంపేట: కూటమి ప్రభుత్వం శుష్కవాగ్దానాలు, శూన్యహస్తాలతో పాలన సాగిస్తోందని, ప్రజలకు మాత్రం హంగు ఆర్భాటాలతో చాలా గొప్పగా పాలన చేస్తున్నట్లు భ్రమలు కల్పిస్తున్నారని మాజీ మంత్రి, జగ్గంపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ తోట నరసింహం అన్నారు. జగ్గంపేటలోని స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం జగన్ అంటే నమ్మకం, బాబు అంటే మోసం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఎంతో ఖచ్చితంగా క్యాలండర్ ప్రకారం అర్హులను గుర్తించి అందరికీ సంక్షేమ పథకాలను అమలు చేశారని కొనియాడారు. నేడు కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఎలా దాటవేయాలో చూస్తోందని దుయ్యబట్టారు. అమ్మ ఒడి పేరును మార్చి తల్లికి వందనం పేరుతో అమలు చేసిన తీరుకూడా తప్పులు తడకగా ఉందని ఆరోపించారు. అర్హులైనా వారందరికీ కూడా తల్లికి వందనం అమలు కాలేదని చాలా మంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు జగనన్న పాలనకు, చంద్రబాబు పాలనలో సంక్షేమ పథకాల అమలులో మధ్య ఉన్న వత్యాసాన్ని గమనించాలన్నారు. జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలనే పేర్లు మార్చి కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది అంటే, పరోక్షంగా జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు మేలు చేసేనట్లే కూటమి నాయకులు అంగీకరించినట్లేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తోట శ్రీరాంజీ,రాష్ట్ర పబ్లిసిటీ విభాగం జాయింట్ సెక్రటరీ మండల పార్టీ అధ్యక్షుడు పాటి రాంబాబు, నియోజకవర్గంలో వివిధ మండలాలకు చెందిన నేతలు పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణ చేస్తున్న తుని రూరల్ మండల నాయకులు, కార్యకర్తలు



కోటనందూరులో జగనే మా నమ్మకం పుస్తకాని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, పార్టీ నాయకులు

ఏడాది పాలనంతా కుతంత్రాలే

కోటనందూరు: సంవత్సర కాలంగా అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వ పాలనంతా కుట్రలు, కుతంత్రాలు, అక్రమ కేసుల బనాయింపు, ప్రజలను నిలువునా మోసం చేయడంతోనే సాగిందని ఎంపీపీ లగుడు శ్రీనివాసు ఆరోపించారు. సోమవారం తన కార్యాలయంలో 'జగనే మా నమ్మకం-బాబు అంటే మోసం' పుస్తకాన్ని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఎంపీపీ మాట్లాడుతూ అధికారం చేపట్టి ఏడాది కాలం ముగిసినా కూటమి ప్రభుత్వం ఒక్క హామీని కూడ అమలు చేయలేదన్నారు. ముక్కుతూ, మూలుగుతూ రెండు రోజుల క్రితం అమలు చేసిన తల్లికివందనం పథకానికి అర్హులైన నిరుపేదలను దూరం చేశారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన ఏడాదికే కూటమి ప్రభుత్వం ప్రజావ్యతిరేకతను మూటకట్టుకుందన్నారు. పార్టీ బీసీ సెల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ గొర్లి రామచంద్రరావు, నల్లమిల్లి గోవిందు, తోలెం రాజులు, వేముల రాజబాబు, జిగటాల కోటసత్తిబాబు, దొగ్గా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగన్ అంటే నమ్మకం పుస్తకావిష్కరణ

తుని రూరల్: మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి అంటే రాష్ట్ర ప్రజలకు ఓ నమ్మకం, బాబు అంటే మోసం అని ప్రజలు విశ్వశిస్తున్నారని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు సకురు నాగేంద్ర నెహ్రూ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఎస్.అన్నవరంలోని స్థానిక పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా ఆదేశాలతో మండల అధ్యక్షుడు దుంగల నాగేశ్వరరావు అధ్యక్షతన జగన్ అంటే నమ్మకం, బాబు అంటే మోసం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఎన్నికల్లో గెలుపొందడమే లక్ష్యంగా ఇచ్చిన సూపర్స్ సిక్స్ హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ప్రభుత్వం అమలు చేయకుండ ప్రజలను మోసం చేస్తుందని దుయ్యాబట్టారు. పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షుడు నాగం దొరబాబు, చోడ్రాజు రాంబాబురాజు, రాయి మేరీఅవినాష్, దొండ వెంకట బెనర్జీ, అన్నంరెడ్డి వీర్రాఘవులు, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

తొండంగి: రాష్ట్ర ప్రజలకు అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి పార్టీ ప్రజలను మోసం చేసిన తీరును ప్రజలు గమనిస్తున్నారని ప్రజలంతా కచ్చితంగా తగిన బుద్ధి చెబుతారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బత్తుల వీరబాబు అన్నారు. మండలంలో ఏ.కొత్తపల్లిలో సోమవారం పార్టీ నాయకులతో కలిసి జగన్ అంటే నమ్మకం-బాబు అంటే మోసం పుస్తకాన్ని ఆవిష్కరించారు. పేద,బడుగు, బలహీన అన్ని వర్గాలకు మేలు చేసి సుభిక్షమైన పాలన అందించిన మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సాధించిన అభివృద్ధి, విజయాలను ఓ పుస్తకంగా పొందుపరచి ఆవిష్కరించారన్నారు. కార్యక్రమంలో వైస్.ఎంపీపీ నాగం గంగబాబు, జిల్లా బూత్‌కమిటీ కన్వీనర్ బెక్కం చంద్రగిరి, తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనం అందలేదు



గాడి శ్రీను

కోటనందూరు: కోటనందూరు మండలం కే.ఎస్ కొత్తూరు గ్రామానికి చెందిన గాడి శ్రీను వ్యవసాయ కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తనకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారని ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా వారిని ప్రభుత్వ వసతిగృహాల్లో చదివిస్తున్నాని ఇటీవల ప్రభుత్వం అమలు చేసిన తల్లికి వందనం పథకం సొమ్ము జమా కాలేదని సోమవారం వాపోయాడు. ఇద్దరి పిల్లలకు పథకం డబ్బులు వస్తే, ఏదొక అవసరం తీరుతుందని భావిస్తే ఖాతాలో నగదు జమా కాలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. సచివాలయానికి వెళ్తే తన పేరుమీద మండల పరిధిలోని కోటనందూరు, ఇండుగపల్లి, కొట్టాం, కేఓ అగ్రహారం, టీజేనగరం గ్రామాల్లో భూమి ఉందని, అందుకే పథకం వర్తించలేదని సిబ్బంది చెప్పారన్నారు. అసలు నాకు సెంటు కూడా వ్యవసాయభూమి లేకపోయినా..ఐదు గ్రామాల్లో భూమి ఉన్నట్లు చూపించడమేంటని బాధితుడు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాడు. అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరుతున్నాడు.

పారిశుధ్యానికి పెద్దపీట

కోటనందూరు: మండల కేంద్రం కోటనందూరులో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఎంపీడీఓ వెంకటనారాయణ అన్నారు. అపరిశుభ్రత..అవస్థలు పేరుతో సాక్షిలో సోమవారం ప్రచురితమైన ఓ కథనంపై ఎంపీడీఓ స్పందించారు. ఈఓపీఆర్డీ జయరాం, పంచాయతీ కార్యదర్శి మోహన్ కుమార్ బాబుతో కలిసి చెత్త వేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. అనధికారంగా వేసిన చెత్తను శుభ్రం చేయించారు. రోడ్లపై చెత్త వేయకూడదని స్థానిక నివాసితులకు సూచించారు. గ్రామంలో రోజూ విస్తృతంగా పారిశుధ్య పనులు నిర్వహించేలా సిబ్బందికి ఆదేశాలిచ్చామన్నారు.

విద్యార్థికి అభినందనలు

తుని రూరల్: మండలం రాపాక ప్రాథమికోన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న లోకవరపు నిఖిల్ ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్‌కు ఎంపికయ్యాడు. సోమవారం ఎంఈఓలు పరవాడ గీతాదేవి, రామకృష్ణలు శాలువాతో విద్యార్థిని అభినందించారు. ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్‌కు అర్హత సాధించడంవల్ల నాలుగేళ్లపాటు రూ.12వేలు చొప్పున విద్యార్థికి స్కాలర్ లభిస్తుందని పాఠశాల ప్రధానోపాధ్యాయడు విక్టర్ జేమ్స్ తెలిపారు. అంబికా ప్రసాద్, మళ్ల శ్రీనివాసరావు, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వర్ణయుగంలా తండ్రీకొడుకుల పాలన



లింగంపర్తిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఇంచార్జి గిరిబాబు

ఏలేశ్వరం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి అశయాలను కొనసాగించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇంచార్జి ముద్రగడ గిరిబాబు అన్నారు. మండలంలోని లింగంపర్తి గ్రామంలో ఆయన సోమవారం పార్టీనాయకులు, కార్యకర్తలతో కలిసి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ సారథ్యంలో పాలన స్వర్ణయుగంలా సాగిందన్నారు. ప్రతిపేదవాడికి సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత వైఎస్సార్‌కే దక్కిందన్నారు. ఆయన వారసుడిగా మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అవినీతికి అస్కారం లేకుండా పార్టీలకు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలనూ అందించారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్ మళ్లీ అధికారం చేపట్టేందుకు పార్టీశ్రేణులు కష్టపడి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గొల్లపల్లి సురేష్, యిజనగిరి ప్రసాద్, గుమ్ములూరి వెంకట రమణ, గొల్లపల్లి కాశీవిశ్వనాథ్, గొంతిరెడ్డి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పలువురికి పరామర్శలు

ప్రత్తిపాడు: మండలంలోని టి.రాయవరం గ్రామంలో సోమవారం సాయంత్రం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇంచార్జి ముద్రగడ గిరిబాబు పర్యటించారు. ఈ మేరకు గ్రామంలోని ఇటీవల మృతి చెందిన కొండి సీతారాం కుటుంబ సభ్యులను పరామర్శించారు. మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు. ఆయన వెంట వైఎస్ ఎంపీపీ ఏనుగు శ్రీను (బంకు శ్రీను), ఎంపీటీసీ సభ్యుడు తటవర్తి రామన్నదొర, తదితరులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన విద్యుత్ కార్యాలయం



గోకవరంలో విద్యుత్ కార్యాలయానికి పోటెత్తిన వినియోగదారులు

గోకవరం: గోకవరంలో విద్యుత్ కార్యాలయం సోమవారం వినియోగదారులతో కిటకిటలాడింది. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన తల్లికి వందనం పథకంలో అనేక మందికి విద్యుత్ వినియోగం 300 యూనిట్లు దాటిందని పథకానికి అర్హత సాధించలేదు. దీంతో వినియోగదారులు గత యేడాది కాలంగా తాము వినియోగించిన విద్యుత్ యూనిట్లు లిస్టుని తీసుకోవడానికి కార్యాలయానికి పోటెత్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వీరి రాకతో కార్యాలయం కిటకిటలాడింది. వీరిలో అధిక సంఖ్యలో మహిళలు ఉండటం విశేషం.

ఎంపీడీఓగా లక్ష్మీరెడ్డి బాధ్యతలు

శంఖవరం: స్థానిక మండల పరిషత్‌కార్యాలయం ఎంపీడీఓగా (ఎఫ్ఏసీ) ఏ.లక్ష్మీరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఐ.పోలవరం నుంచి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సహకారంతో మండలం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఉద్యోగులు ఎంపీడీఓను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

ఎస్టీఓగా వెంకటనారాయణ

ప్రత్తిపాడు: మండల సబ్ ట్రెజరీ అధికారిగా వై.వెంకట నారాయణ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. అమలాపురం ఎస్‌టీఓ కార్యాలయం నుంచి బదిలీ ఆయన ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు ఎస్‌టీఓగా పని చేసిన షేక్ సలీమ్‌ఖాన్ అమలాపురం జిల్లా ట్రెజరీ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

దినచర్యలో యోగా తప్పనిసరి

తుని: అంతర్జాతీయ యోగా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా స్థానిక ఆర్టీసీ డిపోలో సిబ్బందికి యోగాపై సోమవారం శిక్షణ ఇచ్చారు. యోగా గురువు కే.ఎస్.ఎన్ మూర్తి ఆర్టీసీ సిబ్బందికి యోగాపై అవగాహన కల్పించారు. మానవుడు నిత్యం యోగా చేయడంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. దినచర్యలో యోగాను ఓ భాగం చేసుకోవాలని సూచించారు. డిపో మేనేజర్ ఎన్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 21న జరిగే అంతర్జాతీయ యోగా కార్యక్రమంలో సిబ్బందంతా పాల్గోనాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపో సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం తొలగించాలని ఫిర్యాదు

గోకవరం: మండలంలోని గాదెలపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని ఇసుకపల్లి వారి చెరువు గట్టుపై అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాన్ని తొలగించాలని గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కమ్మిల వీరబాబు సోమవారం రాజమండ్రిలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ పి.ప్రశాంతికి ఫిర్యాదు చేశారు. సుమారు వంద ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువుపై 800 ఎకరాల ఆయకట్టు ఉందని, పంట పొలాల్లోకి వెళ్లే రైతులు ఈ గట్టు పైనే రాకపోకలు సాగించాల్సి ఉందన్నారు. గట్టుపై అక్రమ కట్టడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం ఉన్నందున అధికారులు స్పందించి నిర్మాణాన్ని తొలగించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

16 మందికి జరిమానా, శిక్షలు

జగ్గంపేట: స్థానిక పోలీసు సర్కిల్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 16 మందిని అరెస్టు చేసి సోమవారం కోర్టుకు హాజరు పరిచామని జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పెద్దాపురం న్యాయస్థానం 12 మందికి ఒక్కక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించిందని, ముగ్గురుకి 2 రోజులు చొప్పున జైలు శిక్ష, ఒక వ్యక్తికి 4 రోజులు జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపవద్దని సూచించారు.

పీహెచ్‌సీలో వైద్య సేవలు శూన్యం

- కోటనందూరు మండల సమావేశం
- వైద్యసేవలు అందకపోవడంపై ఎంపీపీ ఆగ్రహం
- వివిధ శాఖల అధికారుల డుమ్మా



వైద్యాధికారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీపీ శ్రీనివాసు

కోటనందూరు: కోటనందూరు పీహెచ్‌సీలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందకపోవడంపై ఎంపీపీ లగుడు శ్రీనివాసు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాము, కుక్క కాటుకు గురైన రోగులు పీహెచ్‌సీకి వస్తే త్వరితగతిన వైద్యం అందడం లేదని ఫిర్యాదులొస్తున్నాయన్నారు. 24 గంటలూ అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన సేవలందించాలని వైద్యాధికారి డాక్టర్ యామినికి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసు అధ్యక్షతన సోమవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్నందున రైతుల అవసరాలకు అనుగుణంగా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మండలాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు ప్రజాప్రతినిధులు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

అభివృద్ధి, సంక్షేమంపై చర్చించే మండల సమావేశానికి రోడ్లు, భవనాలు, మైనర్ ఇరిగేషన్, గృహనిర్మాణం, పంచాయతీరాజ్, పశువైద్యం, ఎస్సీ, బీసీ సంక్షేమం, ఆర్టీసీ శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. సమావేశానికి హాజరు కావాలని సమాచారం ఇచ్చినా సంబంధిత అధికారులు హాజరుకాకపోవడంపై కలెక్టర్‌కు నివేదిక సమర్పించనున్నట్లు ఎంపీడీఓ వెల్లడించారు. అధికారుల తీరుతో మండల సమావేశానికి ప్రాధాన్యత లేకుండా పోతోందని ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సర్పంచులు జిగటాల వీరబాబు, సుర్ల రాంబాబు, పసగడుగుల వరహాలు, ఈఓపీఆర్డీ జయరాం, డీటీ సత్యన్నారాయణ, ఏఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గోకవరం: గోకవరం మండలం తంటికొండ గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ఎంపీపీ సుంకర శ్రీవల్లి స్థానిక నాయకులతో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. గ్రామంలో రూ.10 లక్షలతో డ్రైనేజీ నిర్మాణానికి, రూ.8 లక్షలతో కల్వర్టు నిర్మాణానికి స్థానిక సర్పంచ్ బదిరెడ్డి సత్యనారాయణమ్మ, వైస్ ఎంపీపీ మడిక మైనర్ బాబు, స్థానిక కూటమి నాయకులతో కలిసి కొబ్బరికాయలు కొట్టి పనులు ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆదేశాల మేరకు ఎంపీపీ నిధులతో ఈ అభివృద్ధి పనులను చేపటమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీర బాబు, తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

ప్రత్తిపాడు: అధికారం కోసం ఎన్నికల వేళ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగార్రాజు డిమాండ్ చేశారు. కల్లబొల్లి మాటలతో ప్రజలను వంచించి, అధికారం చేపట్టి ఏడాది అయినా గానీ హామీలు అమలు చేయడంతో ముఖ్యమంత్రిగా చంద్రబాబు విఫలమయ్యారని ఆయన విమర్శించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో పేదల సాగు చేసుకుంటున్న భూములకు హక్కులు కల్పించాలని, ఏళ్ల తరబడి పోరాటాలు చేయడం, అధికారులకు విన్నవించడం పరిపాటిగా మారిందే తప్పా సమస్య పరిష్కారం కాలేదని దుయ్యాబట్టారు. ఈ మేరకు లిబరేషన్ అనుబంధ సంస్థల కార్యకర్తలు సోమవారం ప్రత్తిపాడులో భారీ ఎత్తున నిరసన చేపట్టారు. స్థానిక లిబరేషన్ కార్యాలయం నుంచి మార్కెట్, మెయిన్‌రోడ్డు, అల్లూరి జంక్షన్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బంగార్రాజు ప్రసంగిస్తూ చింతలూరు, కిత్తమూరిపేట తదితర గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టిన పేదలకు పట్టాలు మంజూరు చేయాలన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వేతనదారులకు రూ. 600 పెంచి, 200 రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని కోరారు. జిల్లాలో సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ ఏర్పాటు చేయాలన్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలలో స్థానిక యువతకు 80 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. కంగారు ఆపరేషన్ పేరుతో ఆదివాసీలు, మావోలపై జరుగుతున్న దాడులను నిలిపివేయాలని బంగార్రాజు డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ఎం.సూర్యప్రభకు అందజేశారు. లిబరేషన్ రాష్ట్ర కమిటి సభ్యుడు మానుకొండ లచ్చబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు, ఆదివాసీ గిరిజన సంఘ అధ్యక్షుడు రేచుకట్ల సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి

ప్రత్తిపాడు: విశ్రాంత ఉద్యోగుల బకాయిలు తక్షణం చెల్లించాలని ప్రత్తిపాడు తాలూకా విశ్రాంత ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయ ఆవరణలో సోమవారం తాలూకా విశ్రాంత ఉద్యోగుల సమావేశం జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు, విశ్రాంత ఎంఈఓ ముక్కు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు పీఆర్సీ ఎరియర్స్, డీఏ బకాయిలు, కొత్త పీఆర్సీ కమిటీ నియామకం ముందు మధ్యంతర భృతి మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.